# ప్రజాశక్తి

శనివారం 3 జూన్ 2023






## ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి పంట నేలకొరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు చింబిలి రంగయ్య ఆరెకరాల్లో రూ.లక్షలు ఖర్చు పెట్టి అరటి పంటను సాగు చేశాడు. పంట కోత దశలో ఉంది. ఈనేపథ్యంలో వీచిన ఈదురుగాలులు, వర్షానికి పంట మొత్తం నేలకొరిగిందని బాధిత రైతు వాపోయాడు. ఫలితంగా దాదాపు రూ.15లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు.



నేలకొరిగిన అరటి చెట్లను చూపుతున్న రైతు రంగయ్య

# 'ఆ క్వారీతో నష్టపోతున్నాం'..!



క్వారీ వద్దంటూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మన్నీల గ్రామస్తులు

- మా పంటలు దెబ్బతింటున్నాయ్..
- సమాచారం లేకుండానే ప్రజాభిప్రాయ సేకరణ ఎలా.?
- బీఎస్సీ ప్రయివేటు లిమిటెడ్‌కు వద్దు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

'క్వారీ పరిశ్రమ వల్ల తీరని నష్టం జరుగుతుంది.' చుట్టుపక్కలున్న భూముల్లో ఇప్పటికే పంటలు పండించలేని పరిస్థితులు నెలకొన్నాయి. కావున క్వారీ ఏర్పాటును మానుకోవాలి అంటూ అనంతపురం రూరల్ మన్నీల గ్రామ రైతులు ప్రజాభిప్రాయసేకరణ బృందంతో తేల్చిచెప్పారు. బీఎస్సీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు మన్నీల గ్రామంలో 13.665 హెక్టార్ల భూమి లీజుకివ్వడానికి శుక్రవారం నాడు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మన్నీల గ్రామ పరిధిలో జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణను పలువురు రైతులు వ్యతిరేకించారు. బీఎస్సీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థపై గతంలోనే అనేక ఆరోపణలున్నాయి. లీజుకిచ్చిన స్థలంలో కాకుండా మరోచోట మైనింగ్ జరిగిందన్న ఆరోపణలపై మైనింగ్ శాఖ ఇదివరకే చర్యలు తీసుకుందని మన్నీల గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే సంస్థకు మరోమారు 13.665 హెక్టార్ల భూమిని లీజుకివ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం, ప్రజాభిప్రాయ సేకరణ జరపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి సంబంధించిన సమాచారాన్ని ఒక రోజు ముందుగా అంటే గురువారం సాయంత్రం రెండు చోట్ల నామమాత్రంగా టాంటాం వేయించి మమ అనిపించారు. డిఆర్ఒ గాయత్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణలో అనేక మంది రైతులు క్వారీ ఏర్పాటును వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఓ రైతు మాట్లాడుతూ తమ పొలం గట్టునే మైనింగ్ హద్దుగా చూపించి మైనింగ్ లీజుకు ఇస్తున్నారని చెప్పారు. అక్కడ మైనింగ్ జరిగేతే వచ్చే దుమ్ము వలన తమ పొలాల్లో పంటలు ఏమాత్రం పండవన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి కనీస సమాచారాన్ని కూడా గ్రామంలో తెలియజేయకుండా జరపడం సరైంది కాదని అన్నారు. మరో రైతు మాట్లాడుతూ తమ పొలంలో ఇది వరకే మైనింగ్ వల్ల పంటలు దెబ్బతింటున్నాయని చెప్పారు. ఇదే విషయాన్ని మైనింగ్ యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చామన్నారు. దుమ్ము లేవకుండా నీటిని కొట్టాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. పూత దశలో దుమ్ము పంటపై పడటంతో దానిమ్మ పంట మొత్తం దెబ్బతిందని డిఆర్ఒకు తెలియజేశారు. మైనింగ్ లీజుకు ఇస్తున్న ప్రాంతంలో చుట్టూ వంద ఎకరాల వరకు అసైన్డు భూములున్నాయని చెప్పారు. ఈ భూముల్లో మైనింగ్ వలన పంట పండే పరిస్థితి లేకుండాపోతుందని చెప్పారు. ఇంత మంది రైతులకు నష్టం జరుగుతోందని డిఆర్‌కు తెలియజేశారు.

**నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్**
**సిపిఎం నాయకులు రామాంజినేయులు**

బిఎస్సి సంస్థ ఇదివరకే నిబంధనలకు విరుద్ధంగా మన్నీల గ్రామంలో మైనింగ్ జరిపిందని సిపిఎం నాయకులు రామాంజినేయులు తెలిపారు. ఇప్పుడు అదే సంస్థకు మరింత భూమిని మైనింగ్ కోసం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం సరికాదన్నారు. ఈ సంస్థ వల్ల స్థానికంగా ఒక్కరికి కూడా ఉపాధి లభించలేదని చెప్పారు. ఇప్పుడు ఉన్న భూముల్లోనూ మైనింగు వలన పంటలు పండకపోతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కావున ఈ సంస్థకు మైనింగ్ లీజు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ కూడా అందరికీ సమాచారం లేకుండా రహస్యంగా జరపుతున్నారని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులతోపాటు గ్రామ రైతులు త్రివిక్రమ్, రామాంజినేయులు, హరీష్, మడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాలయం.. వ్యాపార నిలయం..!

- సూపర్ మార్కెట్‌లను తలపిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు
- పాఠశాల ప్రాంగణాల్లోనే స్టోర్లు
- పుస్తకాల నుంచి యూనిఫాం వరకూ దోపిడీ
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

**విద్యాలయాలు వ్యాపార నిలయాలుగా మారాయి. పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన చోట వ్యాపార దోపిడీ కొనసాగుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభానికి మరో వారం రోజుల మాత్రమే గడువు ఉండడంతో ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలు వారి వ్యాపారానికి తెరలేపాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల రూపంలోనే కాకుండా పుస్తకాలు, యూనిఫారం అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. విచ్చలవిడిగా విద్యా సామగ్రిని విక్రయిస్తున్న పాఠశాలలను సూపర్‌మార్కెట్లలా మార్చేశారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.**



**ప్రజాశక్తి-హిందూపురం**

జూన్ ప్రారంభం కాగానే విద్యా సంవత్సరం కూడా ప్రారంభం అయ్యింది. ఇప్పటికే అక్రమ అడ్మిషన్లు, అధిక ఫీజులతో తల్లిదండ్రులను ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలు దోపిడీ చేశాయి. వీటికి తోడు విద్యాసామగ్రిని పాఠశాలల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫీజులు చెల్లించడమే భారంగా మారిన తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ఇదొక వ్యాపారంగా చేస్తున్నారు. ఆయా పాఠశాలల పాఠ్య పుస్తకాలు మరో చోట కొనుగోలు చేసే అవకాశం లేదని తమవద్దే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు హుకూం జారీ చేస్తున్నారు. రూ.10 నోటు పుస్తకాన్ని రూ.30కు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతి ఒక్కదాని ధరా మూడు నుంచి ఐదింతలు పెంచి అమ్మేస్తున్నారు. యూనిఫాం సైతం బయట దొరకదని తామే స్కూల్‌లో అందిస్తామని చెబుతూ దీని నుంచి కూడా వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. బయట మార్కెట్‌లో పోలిస్తే కార్పొరేట్ విద్యా సంస్థలలో ప్రతి వస్తువునీ 50 శాతానికి పైగా పెంచి విక్రయిస్తున్నారు. తమ పిల్లలను అదే పాఠశాలలో చదివించుకోవాల్సిన నేపథ్యంలో తల్లిదండ్రులు చేసేది లేక వారి చెప్పిన ధరలకు విద్యా సామగ్రిని కొనక తప్పడం లేదు.



హిందూపురంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

**ఫీజుల మోత**

ప్రతి విద్యా సంవత్సరం కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రతి తరగతికీ ఫీజులను పెంచుతున్నారు. ఎల్‌కెజి విద్యకు రూ.20వేలు అయితే రెండవ సంవత్సరం ఎల్‌కెజి వచ్చే సరికి ఈ ఫీజు 20 నుంచి 30 శాతం పెంచేస్తున్నారు. ఏమని అడిగితే మార్కెట్‌లో అన్ని ధరలూ పెరిగిపోతున్నాయని కావున తామూ పెంచుతున్నామంటున్నారు. 10వ తరగతి చదివించడానికి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు తల్లిదండ్రులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.

**అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం**

కార్పొరేట్‌కు దీటుగా ఉండాల్సిన విద్యా సంస్థలు అధికారుల నిర్లక్ష్యంతో నిర్వీర్యం అవుతున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకూ తగ్గుతూ వుంది. అధికారులు ప్రభుత్వ పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అవసరమైన వసతులన్నింటిని కల్పించాల్సి ఉంది. ఇది చేయకపోవడం వల్ల సరైన సదుపాయాల కల్పన నామమాత్రంగా ఉంటోంది. దీంతో తల్లిదండ్రులు కార్పొరేట్ విద్యాలయాలను ఆశ్రయించి లక్షలాది రూపాయలను వారి జేబుల్లోకి వేస్తున్నారు.

**సదుపాయాలు లేకుండానే అనుమతులు మంజూరు**

ఒక విద్యా సంస్థను స్థాపించాలంటే ప్రభుత్వం ఎన్నో నియమ నిబంధనలను ఉన్నాయి. అయితే కార్పొరేట్ విద్యాలయాలు స్థాపించడానికి ఈ ఏ ఒక్క నిబంధనలు పాటించకుండా ఎక్కడబడితే అక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నారు. హిందూపురం పట్టణంలో నారాయణ, చైతన్య, చైతన్య ఈ టెక్నో మూడు కార్పొరేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క విద్యా సంస్థ కూడా నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. కనీసం విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి కాసింత మైదానం లేదు. ప్రతి సంవత్సరం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించుకోవడానికి స్థలం లేక బయట ఫంక్షన్ హాలులో నిర్వహించుకుంటున్నారు. జీవోఎంఎస్ నెంబర్ ఒకటి ప్రకారం పాఠశాల తల్లిదండ్రుల కమిటీని ఏర్పాటు చేసి ఫీజులు నిర్ణయించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు దీనిని అమలు చేయడం లేదు. ఈ దోపిడీ బాగోతాన్ని విద్యా శాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

**'కార్పొరేట్' పై చర్యలు తీసుకోండి**

విద్యను వ్యాపారం చేసి కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏ ఒక్క ప్రయివేటు విద్యా సంస్థ కూడా నిబంధనలు పాటించడం లేదు. యథేచ్ఛగా పాఠశాలల్లో విద్యా సామగ్రిని విక్రయిస్తున్నారు. అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అధిక ఫీజులు, పుస్తకాల నుంచి యూనిఫాం వరకు లక్షలాది రూపాయలు తల్లిదండ్రుల నుంచి దోపిడీ చేస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం.

**బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.**



సబ్సిడీ యంత్ర పరికరాల మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

## రైతు సంక్షేమానికి పెద్దపీట

**కలెక్టర్ ఎమ్.గౌతమి**
**వైఎస్సార్ యంత్రసేవా కింద ట్రాక్టర్లు పంపిణీ**

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తూ పెద్దపీట వేసిందని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో వైఎస్సార్ యంత్రసేవా పథకం అమలులో భాగంగా రైతులకు వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ఎమ్.గౌతమి ముఖ్య అతిథిగా హాజరై రైతులంకు ట్రాక్టర్‌లు, హార్వెస్టర్‌లు, వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక రైతులన్నారు. రైతు బాగుంటేనే అందరం బాగుంటామన్నారు. ప్రభుత్వాలు రైతులకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు. వరుణ దేవుడు కూడా సహకరించడంతో జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, దీంతో రైతు మోమోలో ఆనందం వెల్లి వెరిస్తోందన్నారు. పంటలు బాగా పండితే రైతుకు ఆనందం అన్నారు. అనంతరం రైతులకు వైఎస్సార్ యంత్రపరికరాల పంపిణీ మెగా సబ్సిడీ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, వివిధ శాకల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో ఈఏపీసెట్ ఫలితాలు

**ఇంటర్మీడియట్ మార్కులు ఆన్‌లైన్లో అప్‌చేయాలి**

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఏపీసెట్-2023 పరీక్ష ఫలితాలను పది రోజుల్లో విడుదల చేయనున్నట్లు పరీక్షల నిర్వహణ ఛైర్మెన్, జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగ జనార్ధన, కన్వీనర్ సి.శోభాబిందు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈఏపీసెట్-2023 పరీక్షకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 2,24,724 మంది విద్యార్థులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలలో 90,573 మంది హాజరయ్యారని తెలిపారు . మొత్తం 3,15,297 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ సంవత్సరం ఈఏపీసెట్ 2023 పరీక్షల్లో అభ్యర్థుల ర్యాంకులు నిర్ణయించడానికి ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన కోర్సుల్లో గ్రూపు సబ్జెక్టుల్లో అభ్యర్థి పొందిన మార్కులకు 25శాతం వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలు, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు, ఇతర రాష్ట్రాల ఇంటర్మీడియట్ బోర్డు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇంటర్మీడియట్ ఒకేషనల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆర్‌జియుకెటి, రాష్ట్ర,జాతీయ స్థాయి ఓఎస్ఎస్ (ఓపెన్ స్కూల్ సిస్టం), సిబిఎస్ఇ పరీక్షల మార్కులను పరిగణనలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. వీటి మార్కుల ఆధారంగా ఫలితాలు నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు సమర్పించిన వారి మార్కులను వెరిఫికేషన్ చేసే ప్రక్రియ కొనసాగుతూ ఉందన్నారు. ఇంకా చాలా మంది విద్యార్థులు వారి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. వారందరూ వెంటనే ఇంటర్మీయడిట్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

## భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఇంకుడుగుంతలు

**సెంట్రల్ నోడల్ ఆఫీసర్ తనూజ రాగూర్**

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, పుట్టపర్తి రూరల్**

ఇంకుడు గుంతలు భవిష్యత్తులో రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని జాయింట్ కార్యదర్శి, సెంట్రల్ నోడల్ ఆఫీసర్ తనూజ రాగూర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ధర్మవరం, పుట్టపర్తి మండలాల్లో అమృత్ సరోవర్ కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ధర్మవరం మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లిలో వాటర్ షెడ్ పథకం కింద నిర్మాణం చేసిన అమత్ సరోవర్ పనులు, పుట్టపర్తి మండల పరిధిలోని కంబాలపర్తి చెరువులో జరిగిన పనులను పరిశీలించారు. రైతులు, లబ్ధిదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతల ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతోందని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇంకుడు గుంతల ద్వారా పంటలకు నీటిని సులవుగా అందించుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తనుజ రాగూర్ మాట్లాడుతూ ఇంకుడు గుంతలను మరింతగా విస్తరింపజేసి అధికంగా నీటిని నిల్వ చేసుకుంటే వరి పంటను కూడా పండించుకునే అవకాశం ఉందన్నారు. ఇంకుడు గుంతలను రైతులందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, రాష్ట్ర జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్, ఈజీఎస్ డైరెక్టర్ చిన్నతాతయ్య, ఆర్డీవో తిప్పేనాయక్, జాయింట్ కమిషనర్ రూరల్ విభాగం శివప్రసాద్, డ్వామా పీడీ రామాంజనేయులు, అనంతపురం పీడీ వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ పీడీ సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి చంద్రిక, జేఈ నాగేంద్ర, ధర్మవరం ఎంపీడీవో మమతాదేవి, పుట్టపర్తి ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం మండలం బుడ్డారెడ్డిపల్లిలో అమృత్ సరోవర్ పనులను పరిశీలిస్తున్న సెంట్రల్ నోడల్ ఆఫీసర్ తనూజ రాగూర్

## శిథిలావస్థలో నార్పల తహశీల్దార్ కార్యాలయం

**భయం భయంగా సిబ్బంది విధులు**

**ప్రజాశక్తి-నార్పల**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ముఖ్యంగా కార్యాలయం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులను సమన్వయం చేసుకుని సమావేశాలు నిర్వహించడంతోపాటు టెలీకాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేసుకుని మండలంలోనే ప్రధానమైన తహశీల్దార్ కార్యాలయం దుస్థితిపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు గోడలన్నీ నెమ్ము ఎక్కుతాయని స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు కార్యాలయం నిండా దోమలు ఉన్నాయని, ఎవరైనా తహశీల్దార్‌తో పని నిమిత్తం మాట్లాడడానికి వెళ్తే అటెండర్ వచ్చి దోమలను చంపే బ్యాటును చేతికిచ్చే పరిస్థితి అని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు అనుకూలంగా ఉండే భవనంలోకి తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

## పుట్టపర్తిలో వడగండ్ల వర్షం

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన గురువారం రాత్రి కురిసింది. రాత్రి 7:30 గంటల నుంచి 8:30 గంటల వరకు ఈ వర్షం కురిసింది. వర్షం రావడంతో రాత్రంతా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు పలుచోట్ల వక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలపై వృక్షాలు పడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించారు. జిల్లా వ్యాప్తంగా 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా,

**రాత్రంతా నిలిచిన విద్యుత్ సరఫరా**

పుట్టపర్తి మండలంలో 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈదురు గాలులకు పలుచోట్ల మామిడి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో వక్షాలు పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆయా పంచాయతీ సర్పంచులు, ప్రజలు పడిపోయిన వక్షాలను తొలగించడానికి కషి చేశారు. కప్పలబండలో గురువారం రాత్రి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దగ్గరుండి పడిపోయిన వక్షాలను తొలగింపచేశారు.

## నీటి పంపింగ్ మోటార్ల మరమ్మతులో నిర్లక్ష్యం వద్దు

**మేయర్ మహమ్మద్ వసీం**

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగరానికి తాగునీరు అందించే పిఎబిఆర్ పంపింగ్ కేంద్రంలో మోటార్లు మరమ్మతుల రిపేరీలో నిర్లక్ష్యం చేయవద్దని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు స్థానిక పిఎబిఆర్ పంపింగ్ కేంద్రంలో రెండవ మోటార్ మరమ్మతులకు గురి కావడంతో చేపట్టిన మరమ్మతులను కమిషనర్ రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రెండవ మోటార్ చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తకుండా అదనపు మోటార్ ద్వారా నీటి పంపింగ్ చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో కేవలం మూడు మోటార్లు మాత్రమే ఉండడంతో ఒక మోటార్ చెడిపోతే నగరానికి తాగునీరు సరఫరా చేయడానికి ఇబ్బంది ఏర్పడేదన్నారు. అయితే తమ పాలకవర్గం ఏర్పాటైన తర్వాత అదనంగా మరో అధిక సామర్థ్యం ఉన్న మోటారును రూ.80 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేయించామన్నారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో హైవోల్టేజ్ వచ్చినా మోటార్లు చెడిపోకుండా ఉండడానికి విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఇఇ చంద్రశేఖర్, ఎఇ సాయి, తదితరులు పాల్గొన్నారు.



నీటి పంపింగ్ మెటార్లను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

**కొవ్వూరు నగర్‌లో రోడ్ సర్వే పరిశీలన**

నగరంలోని 38వ డివిజన్ పరిధిలో ఉన్న కోవూర్‌నగర్‌లో చేపట్టిన రోడ్డు సర్వేను మేయర్ మహమ్మద్ వసీం పరిశీలించారు. ఈ ప్రాంతంలో 3 అడుగులు మేరకు రోడ్డులో బండలు నాటినట్లు సర్వేలో గుర్తించి తొలగించుకోవాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న రహదారుల అభివృద్ధి పనులకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ ప్రభాకర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వారినికోసారి డ్రైడే పాటించాలి

**డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి**

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

ప్రతి ఒక్కరూ వారినికోసారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి సూచించారు. శుక్రవారం మండలంలోని పంపనూరు గ్రామ తండాను సందర్శించి దోమల నివారణకు చేపట్టిన మలతీయన్ పొడి పిచికారీ, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఇళ్లలో నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించి లార్వా పెరగకుండా చూసుకోవాలన్నారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి ఓబులు, వైద్యాధికారి దయాకర్, ఉప మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా ఉప విభాగం సూపర్‌వైజర్లు, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు వెన్నెల, తేజేస్విని, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

సిఎం జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈమేరకు రూ.20 లక్షల జెడ్పిటిసి నిధులతో పట్టణంలోని పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన ఇందిరానగర్ వెళ్లె ప్రధాన రహదారిపై చేపట్టిన సిసి రోడ్డు పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.7 కోట్లతో సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచి లలిత, మాజీ ఎంపిపి ఎసి ఎర్రిస్వామి, నాయకులు గోవిందు, బసవరాజు, ఓబన్న, అంగదాల అంజి, ఆసీఫ్, 3వ వార్డు సభ్యురాలు పద్మావతి, ఏసీ పవన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

# మెరుగైన ప్రజల జీవన ప్రమాణాలు

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు - ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందించడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని తొగట వీర క్షత్రియ కల్యాణ మండపంలో ఎంపిడిఒ చంద్రమౌళి ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి గ్రామ వలంటీర్లు ప్రభుత్వ పాలనలో భాగస్వాములై ప్రజలకు విస్తృతమైన సేవలు అందిస్తున్నారన్నారు. మనమంతా జగనన్న సైనికులం అన్నారు. జగన్ అందిస్తున్న పరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వాల్లో సేవలు పొందాలంటే అధికారుల వద్దకు ప్రజలు వెళ్లేవారని, అదే వైసిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమం వసోతందన్నారు. అనంతరం వలంటీర్లతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తర్వాత ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవారత్నాను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, ఎంఎల్ఒ ఓబులేసు, వక్ఫ్ బోర్డు మెంబర్ మీరం బాషా, నాయకులు ఓబన్న, ఎర్రిస్వామిరెడ్డి, అసీఫ్, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


ఎంపిడిఒ చిట్టా శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న రాయలసీమ సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి

# డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో ఎంపిడిఒ చిట్టా శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మండలానికి 6 డిజిటల్ లైబ్రరీలను కేటాయించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ లైబ్రరి పథకం ద్వారా నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల కోసం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అన్ని సౌకర్యాలు, ఇంటర్నెట్ సదుపాయంతో కలిగిన డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జి.కాశీ రావు, గురు శంకర్, జి.కోటేశ్వరరావు, జ్ఞానేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపి బ్రిజ్‌భూషన్‌ను వెంటనే అరెస్టు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లను నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం రోజున పోలీసుల ద్వారా అమానుషంగా ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం బాధాకరమన్నారు. దేశానికి పథకాలు, కీర్తి ప్రతిష్టలను తెచ్చిన క్రీడాకారుల పట్ల మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ రవీంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి చిన్నా, పిఒడబ్ల్యు నియోజకవర్గ కార్యదర్శి ఆశమాబున్ని, పట్టణ పేదల సంఘం కార్యదర్శి జిలాన్, గుంతకల్లు ఆటో కార్మికుల సంఘం కార్యదర్శి దేవేంద్ర, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు సత్తార్, షేక్షావలి, జానయ్య, కృష్ణ, తిక్కస్వామి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

# టిడిపి అధికారంలోకి రాగానే 'అనంత'లో భూగర్భ డ్రెయినేజీ

## మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

2024లో టిడిపి అధికారంలోకి రాగానే అనంతపురంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి తన కల సాకారం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రహదారుల విస్తరణ చేపట్టాలని, సుభాష్ రోడ్డు గుత్తి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని అనేక సార్లు కలిసి విజ్ఞప్తి చేశానన్నారు. అప్పటి నా కృషి ఫలితంగానే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాత్రం తన కృషితోనే సుభాష్ రోడ్డు, గుత్తి రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తాను చేసిన కృషి సాక్ష్యాధారాలతో సహ పాత్రికేయుల ముందు ఉంచానని, నిజంగా ఎమ్మెల్యే కృషి చేసి ఉంటే చర్చకు రావాలన్నారు. ఇకపోతే విభజన హామీలలో భాగంగా నగరానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సెంట్రల్ యూనివర్సిటీ తెచ్చామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తి చేసినా, మెరుగైన సౌకర్యాలు కల్పించినా కేవలం డాక్టర్లను నియమించుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కోవిడ్ సెంటర్‌గా వినియోగించారు తప్పా పూర్తిస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా ఆసుపత్రిని అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. రాజీవ్ కాలనీ బ్రిడ్జి నిర్మాణం పిల్లర్స్ వరకు తాము పూర్తి చేస్తే, దానికి మీ పార్టీ నాయకుల పేర్లు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. టిడ్కో ఇల్లు ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. 6 వేల టిడ్కో ఇల్లు పూర్తి చేస్తే, ఎక్కడ మాకు మంచి పేరు వస్తుందో అని ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

# బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

**ప్రజాశక్తి-పుట్లూరు**

మండల తహశీల్దార్‌గా మోహన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ సుమతి బదిలీపై యల్లనూరుకు వెళ్లగా బుక్కరాయసముద్రంలో పని చేసిన మోహన్‌కుమార్‌ను ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.


పుట్లూరు తహశీల్దార్ మోహన్‌కుమార్

**బుక్కరాయసముద్రం** : సాధారణ బదిలీల్లో భాగంగా రమాదేవి మండల తహశీల్దార్‌గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. యల్లనూరు మండలంలో తహశీల్దార్‌గా పని చేసిన రమాదేవిని ఉన్నతాధికారులు బుక్క రాయసముద్రానికి బదిలీ చేశారు. దీంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిపి దాసరి సునీత, భర్త నారాయణస్వామి, సహకార సంఘం అధ్యక్షులు గువ్వల పెద్ద వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వరకూటి కాటమయ్య, తదితరులు తహశీల్దార్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


బుక్కరాయసముద్రంలో తహశీల్దార్ రమాదేవికి పూల మొక్క అందజేస్తున్న ఎంపిపి దాసరి సునీత, తదితరులు


# ఆలయంలో మాజీ మంత్రి పూజలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవ వేడుకల్లో మాజీమంత్రి పరిటాల సునీతమ్మ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ముట్టాల గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు తలారి చంద్రను పరిటాల సునీత పరామర్శించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపిటిసి రేనాటి పారిజాతమ్మ, రేనాటి శ్రీనివాసరెడ్డి, రాజా రమేష్, సూరి, వెంకటనారాయణ, నాయకులు పాల్గొన్నారు.


టిడిపి నాయకుడు తలారి చంద్రను పరామర్శిస్తున్న పరిటాల సునీత

# సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు



**ఉరవకొండ** : జేష్ట శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని భూదగవి గ్రామంలో వెలిసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున విశేష పూజలు చేశారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎల్‌వి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పరమ పూజ్య ఆర్కరిషి మహా గురువారి అమృత హస్తాలతో జేష్టాభిషేకం, అర్చన, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# కొనసాగుతున్న సబ్సిడీ వేరుశనగ పంపిణీ

**అనంతపురం** : జిల్లావ్యాప్తంగా సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీ కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ 8,142 రైతులకు 7,323 క్వింటాళ్ల కాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

# స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

**బెళుగుప్ప** : మండలంలోని వెంకటాద్రిపల్లి జెడ్పీహెచ్ఎస్ గణితం స్కూల్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ డిఇఒ సాయిరామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరెడ్డి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి డిపార్ట్మెంటల్ అధికారిగా ఉన్నారు. ఈనేపథ్యంలో రెండు రోజుల కిందట జిల్లాకేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు, ఇతర కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను పోలీస్‌స్టేషన్లకు పంపారు. వీటిని చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి దగ్గరుండి తీసుకోవాలి. అయితే శ్రీనివాసరెడ్డి మాత్రం ఆ సమయంలో పోలీస్‌స్టేషన్ వద్దకు రాలేదు. చీఫ్ సూపరింటెండెంట్ అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీనిపై డిఇఒకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అనంతరం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# 'యువగళం'లో పాల్గొన్న దండు శ్రీనివాసులు

**శింగనమల** : యువగళం పాదయాత్రలో భాగంగా పొద్దుటూరు పట్టణంలోని విడిది కేంద్రంలో యువనేత నారా లోకేష్‌తోపాటు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల మండల టిడిపి నాయకులు కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్లు పంపిణీ

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద మంజూరైన ట్రాక్టర్లను విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనం నుంచి వినాయక సర్కిల్ మీదుగా బళ్లారి రోడ్డు శాంతినగర్ వరకూ నూతన ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మహేంద్ర, వైసిపి నాయకులు ఉపేంద్ర, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ట్రాక్టర్‌ను నడుపుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

# ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి : ఎంపిడిఒ

**బుక్కరాయసముద్రం** : జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్ 2, 4, కాలనీలను సందర్శించి లబ్ధిదారులను వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం నాలుగవ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు విధులకు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయభాస్కర్

# వృద్ధాశ్రమానికి కుర్చీలు, నిత్యావసరాల వితరణ


వృద్ధులతో ప్రగతి పథం యూత్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సభ్యులు

**అనంతపురం** : ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ గుజ్జల సిద్ధు జన్మదినం సందర్భంగా స్థానిక రాకేష్ వృద్ధాశ్రమానికి శుక్రవారం కుర్చీలు, నిత్యావసర సరుకులను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత, జిల్లా యువ అధికారి బిసాటి భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజం మనకు ఏం ఇచ్చింది అని కాకుండా మనం సమాజానికి ఏం ఇచ్చామని ఆలోచించాలన్నారు. అప్పుడే సమాజానికి సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జయమారుతి, సభ్యులు ఫణీశ్వర్, చందు, మంజునాథ, సంస్థ నిర్వాహకులు రఘు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాలో 280 మంది ఎంపిక

**ఉరవకొండ** : పట్టణంలోని మహాత్మ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 280 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 12 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు కలిసి టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ చదివిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 692 మంది జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఆనంద్‌రాజు, మహాత్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బసవరాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కేకే ప్రసాద్ తెలిపారు.


హాబీబుల్లాను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనంత

# వైసిపిలోకి బాకే హాబీబుల్లా

**ప్రజాశక్తి-అనంతపురం**

టిడిపి సీనియర్ నేత బాకే హబీబుల్లా, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో శుక్రవారం సాయంత్రం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా హబీబుల్లా మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితుడినై వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందన్నారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ సిఎం జగన్ ఆశీస్సులతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామనానరు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు అబూసాలెహా, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల సందడి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరానికి విద్యార్థులు విరివిగా హాజరవుతుండటంతో సందడి వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడం, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్, గేమ్స్ వంటి కార్యక్రమాల్లో 69 మంది పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థం మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి కుమారుడు విష్ణు పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, సిబ్బంది కొమ్మా శివశంకర్‌ప్రసాద్, ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, హేమమాలిని, ఉజ్జినేస్వరి, రీసోర్స్‌పర్సన్ ఎం.వెంకటేషప్ప, ఎం.లక్ష్మి, మహేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, చిన్నారులు

# విద్యుదాఘాతంతో గేదెలు మృతి

**బొమ్మనహాల్** : మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో నివాసం ఉంటున్న గంగాధర్‌కు చెందిన రెండు బర్రెలు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. గంగాధర్ తనకున్న బర్రెలను పాకలో కట్టేశాడు. ఈనేపథ్యంలో ఉదయం ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో పాకలో ఉన్న విద్యుత్ వైర్ల కారణంగా షాక్ కొట్టి బర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన బర్రెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.


మృతిచెందిన బర్రెలు

# వైసిపి నాయకులకు సన్మానం

**తాడిపత్రి రూరల్** : తాడిపత్రి రూరల్ పరిధిలోని నాయీబ్రాహ్మణ కమిటీ హాల్‌లో గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికులు వైసిపి నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఎంపిటిసి సగర రవికుమార్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ అరకొర జీతభత్యాలతో జీవనం సాగిస్తున్న తమ కష్టాలను ప్రదీప్‌రెడ్డి, ఎంపిటిసి రవికుమార్ కలిసి ఎమ్మెల్యే పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లి మూడు నెలల నుంచి వేతనాలను పెంచి గట్టెక్కించారన్నారు. ఇందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సన్మానించినట్లు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచుకుని తిన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవారిపల్లి పంచాయతీ కార్మికులు రామలక్ష్మమ్మ, సంధ్యాబాయి, లక్ష్మి, విజయబాయి, తదితరులు పాల్గొన్నారు.



వైసిపి నాయకులను సన్మానిస్తున్న పంచాయతీ కార్మికులు

# రైతు పక్షపాతి సిఎం జగన్

## వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య


**ప్రజాశక్తి-గుత్తి**

రైతుల పక్షపాతి సిఎం జగన్ అని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య కొనియాడారు. ప్రభుత్వం రైతులకు ఐదో విడుత రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్ ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రూ.4 కోట్లు, జిల్లాలో రూ.216 కోట్లు అందజేసినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనం సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, నాయకులు సి.మల్లయ్య యాదవ్, బేడల వెంకటరాముడు, జి.గోవర్ధన్‌రెడ్డి, రామరంగారెడ్డి, లక్ష్మీనారాయణ, ఎం.రంగస్వామి, ఎస్.రాముయాదవ్, ఎన్.రాజశేఖర్, ఎం.రామాంజనేయులు, నూర్‌నాయక్, ఎంపిటిసిలు చిన్న వీరన్న గౌడ్, ఎంసి. లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

**శింగనమల** : నియోజకవర్గవ్యాప్తంగా 52 లక్షల మంది రైతన్నలకు రూ.3,923.21 కోట్ల రైతు భరోసా సాయాన్ని ఖాతాల్లో జమ చేసినట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు అందజేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి.నారాయణ, నాయకులు చెన్నకేశవులు, శివశంకర్‌రెడ్డి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉరవకొండ** : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం విడపనకల్లు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పెట్టుబడి సాయం కింద 5వ విడుత రైతుభరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో విడపనకల్ పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, ప్యాపిలి నాగరాజు ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ నాయకులు సుంకన్న, సర్పంచులు రామాంజనేయరెడ్డి, కేశన్న, ఉమాశంకర్, విడపనకల్ వికలాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, నాయకులు భీమరావు, దేశాయి సిద్ధార్థ, దాసరి వెంకటేష్, సుంకన్న, హంపయ్య, ప్రసాద్, అశోక్‌రెడ్డి, సురేష్‌యాదవ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నాయకులు, కార్యకర్తలు


విడపనకల్లు మండలంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు